ప్రజాశక్తి
బుధవారం 28 ఫిబ్రవరి 2024
5
విజయనగరం

తాగునీటి సమస్య పరిష్కారానికి మోనటరింగ్ సెల్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం

రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలోని తాగునీటి సమస్యలపై గ్రామీణ నీటి సరఫరా కార్యాలయంలో మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెఎల్ ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను మోనిటరింగ్ సెల్ నెంబరు 9100120711 నెంబరుకు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

'గడప గడపకు' నిధులు నాలుగో వంతే

కోరింది రూ.107కోట్లు

విడుదల చేసింది రూ.24.35కోట్లు

లక్ష్యానికి చేరుకోని కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంచ పాండవులు ఎంత మందంటే 'మంచం కోళ్ల మాదిరిగా ముగ్గురేనంటూ రెండు వేళ్లు చూపిస్తూ ఒక్కటే' అని అన్నట్టుగా ఉంది ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు వైసిపి ప్రభుత్వం పథకం అమలు తీరు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒత్తిడితో ఎమ్మెల్యేలు గడప గడపకు నెలరోజులు పాటు వెళ్లి ప్రభుత్వాన్ని బలపర్చాలంటూ విన్నవించినప్పటికీ ఆ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన పేరిట ప్రతి సచివాలయానికి రూ.20లక్షల వరకు ఖర్చుచేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఈలెక్కన జిల్లాలోగల 626 సచివాలయాలకు రూ.1252 కోట్ల మేర మంజూరు చేయాల్సి ఉంది. వీటిని గ్రామాల్లోని తాగునీరు, కాలువలు, సిసి రోడ్లు తదితర మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయాలని ప్రభుత్వం విధివిధానాలు రూపొందించింది. కానీ, మన జిల్లాలో ప్రజాప్రతినిధుల సిఫార్సులతో రూ.107.3 కోట్లతో 3,357 పనులకు మాత్రమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో 3,150 పనులకుగాను రూ.97కోట్లు మంజూరు చేసింది. ఇందులోనూ రూ.72.75కోట్ల విలువలగల 2,448 పనులు ప్రారంభించారు. రూ.24.35కోట్ల వ్యయంతో 802 పనులు మాత్రమే పూర్తయ్యాయి. చాలా వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు పలువురు సర్పంచులు, కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్నిబట్టి జిల్లాలో తలపెట్టిన పనులుగానీ, నిధుల వినియోగం విషయంలో గానీ నాలుగో వంతు మాత్రమే జరిగాయని అర్ధమౌతోంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తామన్న నిధుల్లో అరకొరగానే విడుదల చేయడం, ఇంకా చాలా గ్రామాలు సమస్యలతో కొట్టిమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో గడప గడపకు వైసిపి ప్రభుత్వం పేరిట ఎమ్మెల్యేలు, నాయకులు ఎన్నికల ముందు ఇంటింటికీ వెళ్లడానికి మాత్రమే ఉపయోగ పడిందని, ఆ సందర్భంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనపై ఇచ్చిన హామీలు నెరవేరలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనులకు చింతేనా?

చింతపండు దిగుబడి అంతంత మాత్రమే • జిసిసి ధర కేజి రూ.32.40పైసలు

కొనుగోలు ధర రూ.80కి పెంచాలని గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిపుత్రులు తరతరాల నుంచి అడవినే నమ్ముకొని పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు ఏటా పండే ప్రధాన పంటలైన చింతపండు, జీడిపై ఎక్కువ శాతం ఆధార పడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వచ్చినా చింత పంట దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ఖరీఫ్‌లో ఎక్కువ వర్షాలు, చలి తీవ్రత కారణంగా చింతపండు దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. చింతపండు సేకరణ కోసం పిల్లాపాపలతో కొండలు, గుట్టలపై ఉన్న చింత చెట్ల వద్దకు వెళ్లి ఎంతో కష్టపడి చింత బొట్టలను సేకరించి, తొక్కలు తీసి అమ్మకాల కోసం కిలోమీటర్లు కాలినడకన మండల కేంద్రానికి, వారపు సంతలకు, జిసిసి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తుంటారు. ప్రతి ఏటా చింతపండు సేకరణలో వ్యయ ప్రయాసలు పడుతున్న గిరిజనులకు గిట్టుబాటు ధర లేక.. చివరకు చేసేది లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు జిసిసి నిబంధనలు గిరి పుత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. జిసిసి కొనుగోలు కేంద్రాలకు చింతపండు అమ్మకానికి తీసుకొస్తే నాణ్యత, పొడిగా లేదని త సిబ్బంది పలు రకాల నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారు. దీంతో గత్యంతరం లేక చివరి నిమిషంలో వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. జిసిసి కిలో చింతపండు రూ.32.40 పైసలు ధర నిర్ణయించి కొనుగోలు చేయడంతో గిరిజనుల్లో నిరాశ నెలకొంది.

పదివేల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని మండలాల్లో 70వేలకు పైగా చింత చెట్లు విస్తారంగా ఉన్నాయి. ఏటా పదివేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోందని అంచనా. గిరిజనులు సేకరించిన చింతపండును గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుంది. అనంతరం టెండర్లు పిలిచి వర్తకుల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. జిసిసికి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో పంట నిల్వలను ఇతర ప్రాంతాల్లో భద్రపరచాల్సిన పరిస్థితి నెలకొంది. జిసిసి నెల నెలా టన్నులు లెక్కన అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఏటా గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు చేస్తున్న ధర రావడం లేదు. గత ఐదేళ్లలో 18,590 కింటాళ్ల చింతపండు కొనుగోలు చేస్తే, ఇప్పటి వరకు 11,357 క్వింటాళ్లు మాత్రమే అమ్మకాలు జరిగాయి. 7,233 క్వింటాళ్లు చీపురుపల్లి కోల్డ్ స్టోరేజ్‌లో చింతపండు నిల్వచేసి ప్రతి ఏటా రూ.7 లక్షలు అద్దె చెల్లిస్తుంది. దీంతో ఆ సంస్థ పూర్తిస్థాయి లో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాణ్యత లేదని, తడిపిన చింతపండు తీసుకొస్తున్నారని రకరకాల కారణాలు చూపుతూ అంతంత మాత్రంగానే అధికారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

తప్పని దళారుల బెడద

గిరిజనులు సేకరిస్తున్న చింతపండు నాణ్యత లేదని జిసిసి అధికారులు కొనుగోలు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేసిన వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి మంచి ధర పలికినప్పుడు విక్రయిస్తున్నారు.

కిలో రూ. 80కు కొనుగోలు చేయాలి

ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ కిలో చింతపండు ధర రూ.80కు నిర్ణయించి గిరిజనుల వద్ద నుంచి కొనుగోలు చేయాలి. ప్రతి వారపు సంతలోనూ, గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిరిజనుల వద్ద నుంచి నేరుగా చింతపండు కొనుగోలు చేయాలి.

కోలక అవినాష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

చింతపండు కొనుగోలు ప్రారంభిస్తాం

గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ ద్వారా తాడికొండ, గుమ్మ లక్ష్మీపురం, దేరువాడ, దుడ్డ ఖల్లు, నీలకంఠాపురం, వంగర, వలస బల్లేరు, గొరడ, మొండెంఖల్ గ్రామాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు ప్రారంభిస్తాం. తడి చింత పండు కొనుగోలు చేసే ప్రసక్తే లేదు. జిసిసి నిర్ణయించిన ధర రూ.32.40పైసలు. ఈ ఏడాది 100 టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నాం.

వి.కష్ణ ప్రసాద్, జిసిసి మేనేజర్, గుమ్మలక్ష్మీపురం.

సదస్సులో మాట్లాడుతున్న అప్పారావు

'విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాస్థాయి అవగాహన సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని చేతి వృత్తిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రెన్యూర్‌షిప్ (ఎంఎస్ఎంఇ) ఆధ్వర్యాన స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సెమినార్ నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ చేతివృతులల అభివృద్ధి ద్వారా స్థానికంగా ఉపాధి పొంది తద్వారా వలసలను అరికట్టవచ్చన్నారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలసబాట పడుతున్నారని ఇటువంటి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందాలని అన్నారు. జిల్లా పారిశ్రామిక అభివద్ధి సంస్థ జనరల్ మేనేజర్ పాపారావు మాట్లాడుతూ చేతివృత్తిదారులు నూతన ప్రయత్నాలను ప్రారంభించాలని, ఈ పథకం కేవలం చేతివత్తి దారుల కుటుంబాల ఆర్థిక ఉన్నతికి ఉపయోగ పడేదిగా ప్రభుత్వం రూపొందించి జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంఎస్ఎంఇ డైరెక్టర్ పిఎం విశ్వకర్మ నోడల్ అధికారి అప్పికొండ శ్రీను మాట్లాడుతూ పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారంతా ఈ పథకానికి అర్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆర్. గోవిందరావు, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా హెడ్ సిహెచ్ కోటేశ్వరరావు, ఎన్‌జిఒ ప్రతినధులు నీడ్ సంస్థ డైరెక్టర్ పి. వేణుగోపాల రావు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను ధిక్కరిస్తున్న మిమ్స్ యాజమాన్యం

ఉద్యోగులకు మద్దతుగా 29న రాష్ట్ర వ్యాప్త ఆందోళన • మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం కార్మిక చట్టాలను ధిక్కరించి ఇంతవరకు ఉద్యోగులు, కార్మికులకు జనవరి నెల జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గం మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ అన్నారు. మంగళ వారం స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి నెలా 7వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని చట్టం చెబుతున్నా మిమ్స్ యాజమాన్యం ధిక్కరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులను, కార్మికులను ఇబ్బందులు, వేధింపులకు గురిచేసి రోడ్డు మీద పడేటట్లు చేసిందని తెలిపారు. జిల్లా కలెక్టర్,లేబర్ అధికారులు జనవరి నెల జీతం ఇవ్వాలని చెప్పినా, చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పినా ఖాతరు చేయకుండా మొండిగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఎఒ, హెచ్ఆర్, బిడియం, ఆర్ ఎంఒ అధికారాలను ఉపయోగించుకుని ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారానికి చేస్తున్న పోరాటానికి మద్దతు గా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 29న ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.నారాయణరావు, అప్పల నాయుడు, రామకృష్ణ బంగారు నాయుడు, మూర్తి, వరలక్ష్మి, గౌరీ, కామునాయుడు, నాగేశ్వరరావు, మధు, నాగభూషణం, రాంబాబు, రాజాబాబు, స్వర్ణలత, భవాని తదితరులు పాల్గొన్నారు.

ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

బిఐఎస్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-విజయనగరం

బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉండాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ జాయింట్ డైరెక్టర్ ఆర్. కేశవరెడ్డి అన్నారు. జెడ్‌పి ప్రాంగణం లోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో భారత ప్రమాణాలపై పై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ భారత ప్రమాణాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకు వెళ్లడానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ పంచాయతీరాజ్ శాఖతో కలసి ఈకార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ వర్కుషాపు ద్వారా ఐఎస్ఐ, హాల్ మార్క్ వంటి నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యతతో పాటు వాటి పరిధిలో వచ్చే వస్తువుల వినియోగం గురించి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంపొందించుకొని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలో మార్చి 6 వరకు నిర్వహిస్తామన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చెన్నై సౌత్ జోన్ జాయింటు డైరెక్టరు ఆర్. తిరుమలరావు భారత ప్రమాణాల ప్రాధాన్యతను వాటి పరిధిలోకి వచ్చే వస్తువులను, హాల్ మార్కు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమం లో డిఎల్‌డిఒ జివిఎస్ నిర్మలాదేవి, డిపిఆర్‌సి ఎఒ వేదవతి, డిపిఆర్‌సి ట్రైనింగ్ మేనేజరు ఎ.దేవుడు, ఆర్‌పిలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-గజపతినగరం

మన్యం జిల్లా సాలూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి మంగళవారం గజపతినగరంలో ఘన స్వాగతం లభించింది. నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు స్థానిక జాతీయ రహదారిపై భువనేశ్వరికి స్వాగతం పలికారు. దీంతో ఆమె కారు దిగి కాసేపు వారితో ముచ్చటించారు. అభ్యర్థి శ్రీనివాస్, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, మహిళా విభాగం నాయకురాలు మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి తదితరులతో కొద్దిసేపు ముచ్చటించారు. పార్టీ విషయాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసు విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ , సర్పంచ్ జానకిరాం తదితరులు ఉన్నారు.

టెన్త్ పరీక్షకు ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చేనెల 18 నుంచి జరుగనున్న టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. విద్యార్థులు తమ నివాసం నుండి పరీక్షా కేంద్రాలకు వెళ్లే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులలో తమ హాల్ టికెట్ ను చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. ఈ అవకాశం పరిక్షలు జరిగిన రోజులలో మాత్రమే ఉంటుందన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు దాసన్నపేటకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28న బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దాసన్నపేట సబ్‌స్టేషన్‌లోని 11కెవి ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించే పని ఉన్నందున ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.హరి తెలిపారు. దాసన్నపేట, రాజీవ్‌నగర్ కాలనీ, లెంకవీధి, జొన్నగుడ్డి, బాలాజీ జంక్షన్ పరిసర ప్రాంతాలు విద్యుత్ ను నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

ఖోఖో పోటీల్లో బాలుర జట్టు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23 నుండి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట లో జరిగిన సీనియర్ అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం, బాలికల జట్టు తృతీయ స్థానం సాధించాయి. వీరి విజయం పట్ల ఖోఖో అసోసియేషన్ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మి, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపాల్, ట్రెజరర్ మల్లికార్జున్ హర్షం వ్యక్తం చేశారు. ఈ జట్టుకు మేనేజర్ గా సత్య ప్రసాద్ వ్యవహరించారు. క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్‌కోలగట్ల, మేయర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్ర భవన నిర్మాణానికి మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగనా ఆయన మాట్లాడుతూ స్థానిక అంబేద్కర్ జంక్షన్లో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో రూ.1.55కోట్లతో నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇందుకోసం రూ.40 లక్షలు ఇప్పటికే మంజూరైనట్లు తెలిపారు. భారత రాజ్యాంగాన్ని లిఖించిన అంబేద్కర్ ఆశయాలను అనుసరించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బోనెల ధనలక్ష్మి, పట్నాన పైడిరాజు, పొట్నూరు శ్రీనివాసరావు, రేగాన రూపాదేవి, దాసరి సత్యవతి, పట్టా ఆదిలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.12.50 లక్షలతో నిర్మించిన రోడ్డు ప్రారంభం

నగరంలోని 40వ డివిజన్‌లో రూ.12.50లక్షలతో నిర్మించిన రహదారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ లయ యాదవ్, స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ధ్యేయంగా ఐదేళ్లుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కషిచేసి సఫలీకతులయ్యారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి, మత్స సత్యనారాయణ, డివిఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గాజులరేగలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మరింత ఉపయుక్తంగా ఉండగలవని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గాజులరేగలో యువత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పేదలకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉచిత శిబిరం నిర్వహకులు ప్రసాద్, వైసిపి నగర ప్రధాన కార్యదర్శి జామాన శ్రీనివాసరావు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఇచ్చిన స్ఫూర్తితో పేదలకు సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, వైసిపి నాయకులు కనుగల రాజా, గార సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమాజాభివృద్ధిలో ప్రతి అడుగూ సైన్స్‌తోనే ముడిపడి ఉంటుందని సీతం ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని స్థానిక గురజాడ పాఠశాలలో ఈనెల 19న సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించిన విషయం విధితమే. విజేతలకు పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన చేతులమీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోబుల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ సముద్రపు నీరు నీలిరంగులో ఎందుకు ఉంటుందనే విషయాన్ని చాలా కాలంపాటు పరిశోధించారని, 1928 సంవత్సరం నాటికి అందుకు గల కారణాన్ని కనుగొన్నారని వివరించారు. ఇందుకుగా 1930లో ఆయనకు నోబుల్ బహుమతి లభించిందన్నారు. దీన్నిబట్టి కష్టపడి తగిన ఫలితంతో పాటు గుర్తింపు కూడా లభిస్తుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాల న్నారు. సివి రామన్ పరిశోధనా ఫలితానికి గుర్తింపుగా ఏటా ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవాన్ని జరుపు తున్నారని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకే ఏటా తమ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నా మన్నారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు తరగతికి ఇద్దరు చొప్పున మొత్తం ఎనిమిది మందికి ఒకొక్కరికీ రూ.1000 నగదు బహుమతి, ఎల్‌కెజి నుంచి 9వ తరగతి వరకు ఎంపికైనా విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసినట్టు వివరించారు. హెచ్ఎం శేఖర్ మాట్లాడుతూ గత పదేళ్లగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో గురజాడ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని అన్నారు. ఇటీవల నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో మొత్తం 600మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన వివరించారు.

హిమబిందుకు షీల్డు అందజేస్తున్న డాక్టర్ శశిభూషణరావు

క్రీడారంగంలోనూ కక్ష సాధింపు చర్యలు

అదితి విజయలక్ష్మి



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాజకీయాల్లోనే కాదు చివరకు క్రీడారంగంలో కూడా వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేసి క్రీడాకారుల జీవితాలతో ఆడుకుం టోందని విజయనగరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పూసపాటి ఆదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 17 , 21వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. క్రీడారంగం అభివృద్ధి కోసం ఇటీవల క్రీడలు నిర్వహించిన ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర అని పేరు పెట్టి క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని అన్నారు. క్రికెట్ టీంలో 17 వ స్థానంలో వున్న వైసిపి నాయకుడి కుమారుడిని తెలుగు తేజం, టీం ఇండియా టెస్ట్ స్పెషలిష్ట్ హనుమ విహారి మందలించాడనే కారణంతో అతన్ని ఆంధ్రా రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలిగేలా చేయడం బాధాకరమని అన్నారు జగన్ ప్రభుత్వం క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి సంఘం నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ నాయకులు అవనాపు విజయ్ ,పిల్లా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న తాలూకా కేంద్రాల్లో ధర్నాలు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకుండా దాటవేత చర్యలకు నిరసనగా ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 29న తాలూకా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ బుకారి బాబు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక లక్కపందిరి వీధిలో గల తమ యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎపిటి ఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్: జె సి రాజు మాట్లాడుతూ మధ్యంతర భృతి ప్రకటించాలని, రూ.20 కోట్ల ఆర్థిక బాకాయిలు చెల్లించాలని కోరుతూ పాత తాలూకా కేంద్రాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖాతాల్లోకి ఆసరా సొమ్ము జమ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - భోగాపురం

డ్వాక్రా మహిళల వ్యక్తిగత ఖాతాల్లోకి ఆసరా సొమ్మును బ్యాంకు అధికారులు సోమవారం నుంచి జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఆసరా సొమ్మును బ్యాంకులకు జమ చేసినప్పటికీ కొన్ని బ్యాంకులు మాత్రం డ్వాక్రా మహిళల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయలేదు. దీంతో ప్రజాశక్తిలో మహిళలకు ఏది ఆసరా అనే ప్రత్యేక కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి వెలుగు ఏపిఎం రమణతో మాట్లాడారు. మహిళల వ్యక్తిగత ఖాతాలకు వెంటనే జమ చేసేలా బ్యాంక్ సిబ్బందితో మాట్లాడాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం భోగాపురం ఎపిజివిబి బ్యాంకుకు వెళ్లి మేనేజర్‌తో మాట్లాడారు. వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని చెప్పడంతో వెంటనే మహిళల ఖాతాలకు ఈ సొమ్ము జమ చేస్తున్నారు.

బలిజిపేట రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలి

బొబ్బిలి: బలిజిపేట రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో కోరారు. బలిజిపేట రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు.

నియోజకవర్గ జెసిఎస్ కన్వీనర్‌గా వలిరెడ్డి

చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గం జెసిఎస్ కన్వీనర్‌గా వలిరెడ్డి శ్రీనివాసనాయుడుని అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో చీపురుపల్లి నియోజకవర్గం జెసిఎస్ కన్వీనర్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణకి, ఎమ్మెల్సీ బెల్లాన చంద్రశేఖర్‌కి, జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకి ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. నియోజకవర్గంలో అందరిని కలుపుకొని వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

బొబ్బిలి: ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఓ కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. పెంట వేగావతినదిలో ఇసుక అక్రమ తవ్వకాలను రైతులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వేగావతి నదిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టినట్లు చెప్పారు. గొల్లాది భూములలో ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. ఇసుక అక్రమ తవ్వకాలు వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరారు.

సర్పంచ్ వెంకటరావుకు సన్మానం

వేపాడ : మండలంలోని సింగరాయ సచివాలయం పరిధిలోని జగ్గయ్యపేట, అరిగిపాలెం, సింగరాయ గ్రామాలకు సంబంధించిన గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకటరావును, అరిగి పాలెం గ్రామ సర్పంచ్ దుల్ల లక్ష్మిని, జగ్గయ్యపేట గ్రామ సర్పంచ్ పంతాకు రాములమ్మ, సింగరాయ ఎంపిటిసి రాయవరపు రాజేష్ ని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దుల్ల సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి కన్యనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

వేపాడ: మండలంలోని నల్లబిల్లిలో రెండవ రోజు భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి జాతర రెండో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ కోలాటం ఆకట్టుకునేలా నిలిచింది. బుధవారం మధ్యాహ్నం ఎడ్ల పరుగు ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పెరుమాలిలో సెక్టార్ సమావేశం

తెర్లాం: మండలంలోని పెరుమాలి అంగన్వాడీ-1 సెంటర్‌లో మంగళవారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో బాడంగి ఐసిడిఎస్ పిఒ కె రాజ్యలక్ష్మి హాజరై మాట్లాడారు. ముందుగా ఇక్కడ నిర్వహిస్తున్న మూడు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులు ఫోన్ వర్క్ కంప్లీట్ చేయాలని సూచించారు, గర్భిణులకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఫీడింగ్ అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ సేవా కేంద్రాల వినియోగం పెరగాలి

రామభద్రపురం: ఖాతాదారుల సేవల్లో ఎస్‌బిఐ నిరంతరం ముందంజలో ఉంటూ వారి శ్రేయస్సుకు పెద్దపీట వేస్తున్నామని ఎస్‌బిఐ డిజిఎం ఎఫ్ఐ దేవీలాల్ మెహ్రా తెలిపారు. మంగళవారం స్థానిక ఖాతాదారుల సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సత్వర సేవల కోసం ఈ కేంద్రాలు ఉపకరిస్తాయన్నారు. వీటిని వినియోగించుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. ఇక్కడ అన్ని రకాల డిపాజిట్, విత్‌డ్రా, ప్రభుత్వ భీమా పథకాలు, ఆరీ, అకౌంట్ ఓపెనింగ్ వంటి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ఏపీవై, పిఎం జెజెబీవై, పిఎంఎస్‌బివై ప్రతీ ఖాతాదారులు చేసుకోవాలన్నారు. వీటి ప్రీమియం అతి స్వల్పమని ప్రయోజనం మాత్రం అతి భారీగా ఉందని తెలిపారు. అనంతరం స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్‌ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు జారీ చేశారు. బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది సమన్వయంతో కృషి చేసి బ్యాంక్ పురోభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐ మేనేజర్ కళ్యాణ్ తేజస్వి, స్థానిక బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్, సిఎస్‌పి సత్యారావు పట్నాయక్, సబ్ కెఒ సునంద పాల్గొన్నారు.

'జగన్‌ను సాగనంపడానికి ప్రజలు సిద్ధం'

రాజాం: నియంత జగన్మోహన్‌రెడ్డిని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. టిడిపి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంతకవిటి మండలాని చెందిన జావాం, సురవరం, వాసుదేవ పట్నం, మోదుగుల పేట, బిల్లాని, ఎస్ రంగారాయ పురం, కె ఆర్ పురం, గోవిందపురం, పుల్లిట గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ గెలుపునకు కృషి చేయాలన్నారు. నియోజక వర్గంలో ఇంటింటికీ వెళ్లి గతంలో చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరిస్తూ, చంద్రబాబు నాయుడు రూపకల్పన చేసిన మినీ మానిఫెస్టోలో ఉన్న సూపర్ సిక్స్ పథకాలను తెలియపరచాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందంటే అది ఒక్క తెదేపా హయాంలో తప్ప సీఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సంతకవిటి మండల నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

29న కలెక్టరేట్ వద్ద రిలేనిరహార దీక్ష

విజయనగరం టౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని,సంక్షేమ బోర్డు నిధులు రూ.2వేల కోట్లు సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలని కోరుతూ ఈ నెల 28,29 తేదీల్లో జిల్లా లో ఉన్న అన్ని నియోజవర్గ కేంద్రాల్లో రిలే నిరహర దీక్షలు చేపడతామనిఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి రమణ తెలిపారు. అందులో భాగంగా 29న కలెక్టరేట్ వద్ద నిరాహారదీ చేస్తామన్నారు. మంగళవారం కొండకరకాంలో ప్రచారం చేస్తూ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న రూ.2వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్లించి సంక్షేమానికి తూట్లు పొడిచిందని అన్నారు. ఈనేపథ్యంలో చేపట్టే నిరాహారదీక్షల్లో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కంది త్రినాధరావు పాల్గొన్నారు.

రైతులపై నిర్బంధాన్ని వ్యతిరేకించండి

విజయనగరం టౌన్: పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రైతులు ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులతో బుల్లెట్ల వర్షం కురిపించిన బిజెపి వైఖరిని ప్రజలంతా వ్యతిరేకించాలని ఎన్ వై ఎస్, పిడిఎస్‌ఒ నాయకులు పి.అప్పలరాజు,రాజేష్ కోరారు. మంగళవారం రైతులు పోరాటానికి మద్దతు తెలియచేస్తూ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని,ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేశారు.రైతులు కొద్ది రోజుల గా దేశ రాజధానిలో రైతులు కు ఇచ్చిన హామీలు కోసం పోరాటం చేస్తుంటే వారి పై పోలీసులను ఉపయోగించి కాల్పులు జరిపించడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో గిరిప్రసాద్, దిలీప్, నాగరాజు, హర్షవర్ధన్, శేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలో ఆగని నిరసన జ్వాల

టిడిపి జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే జాబితా విడుదల చేసిన తరువాత పార్టీలో అసమ్మతి సెగలు భగ్గుమన్న విషయం తెలిసిందే. జాబితా ప్రకటించి ఐదు రోజులు కావస్తున్నప్పటికీ నిరసన జ్వాలలు తగ్గడం లేదు. ఇంకా తమ నాయకునికి టిక్కెట్టు ఇవ్వాలని ఆయన మద్దతుదారులు , కార్యకర్తలు డిమాండ్ చేస్తూ ర్యాలీలు, నిరసనలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణకు గజపతినగరం ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వాలని మంగళవారం బొండపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కెఎ నాయకుడకు టిక్కెట్టు ఇవ్వాలని కొంత మంది నాయకులు టిడిపి కార్యాలయంలో సమావేశమై డిమాండ్ చేశారు. మరో పక్క నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజుకు టిక్కెట్టు ఇవ్వాలని లేకపోతే సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ టిడిపి నాయకులు డెంకాడలో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌ను గెలిపించాలని తన తండ్రి, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు మంగళవారం గంట్యాడ మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు.

కరణం శివరామకృష్ణకు టికెట్ ప్రకటించాలి

ప్రజాశక్తి- బొండపల్లి

గజపతినగరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా కరణం శివరామకృష్ణ పేరును ప్రకటించాలని కోరుతూ మండల కేంద్రం వద్ద మంగళవారం టిడిపి కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు శివరామకృష్ణకు మద్దతుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కరణం శివరామకృష్ణకు ఎమ్మెల్యే టికెట్ వెంటనే ప్రకటించాలని, ఈ విషయంలో చంద్రబాబు పునరాలోచన చేయాలని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గొర్లె సత్యవతి, గ్రామ పార్టీ

డెంకాడ: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్

అధ్యక్షులు పైల శ్రీనువాస రావు, సీనియర్ టిడిపి నాయకులు దాసరి శ్రీనువాసరావు, యడ్ల పైడిపునాయుడు, బొండపల్లి బుజ్జిబాబు, నక్కాన శివ కుమార్, తాళ్ళపూడి అప్పలనాయుడు, కొవ్వాడ బాలరాజు, చంద్రరావు, అప్పారావు, బూర లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కెఎ నాయుడు సరైన అభ్యర్థి

గజపతినగరం: స్థానిక పార్టీ కార్యాలయంలో మండల క్రియాశీలక కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించి మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడుకు ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించాలని కోరారు. కెఎ నాయుడు మాత్రమే టిడిపికి సరైన అభ్యర్థి అని చెప్పారు. అధికారం ఉన్నా లేకున్నా కార్యకర్తలకు అండగా ఉన్నారని, ప్రతిపక్షంలో నాలుగేళ్ల పది నెలలు ప్రజా సమస్యలు పై పోరాటం చేసిన ఆయన్ను కాదని పలు పార్టీలు మారిన బొత్స అనుచరుడిగా ఉన్న కొండపల్లి శ్రీనివాస్‌ను అభ్యర్థిగా ప్రకటించడం పై పున్ణ పరిశీలన చేయాలనే తీర్మానాన్ని పార్టీ కార్యాలయానికి పంపిస్తున్నాం అని తెలిపారు. బొత్సకు దీటైన అభ్యర్థి కెఎ నాయుడు మాత్రమే అని కార్యకర్తలంతా ఆయనకు మద్దతుగా ఉన్నామని అన్నారు. ఈ సమావేశంలో 30 పంచాయితీల నుండి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్రోతుకు సముచిత స్థానం కల్పించాలి

డెంకాడ: టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజుకు ఎమ్మెల్యే టిక్కెట్టు అయినా ఇవ్వాలి లేదంటా సముచిత స్థానం కల్పించాలని డెంకాడ మండల నాయకులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పొత్తులో భాగంగా జనసేనకి టికెట్ కేటాయించడంపై అధిష్టానం మళ్లీ పునపరిశీలన చేసి కర్రోతుకు అవకాశం ఇవ్వాలన్నారు. దీనిపై అధిష్టానానికి వినతిపత్రాన్ని అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు కలిదిండి పాణిరాజు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొయనేని రమణ, కొర్నాన ఆదిబాబు, చిల్ల పద్మ, మని పైడయ్య, చీకటి సుహాసిని, పడాల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ విజయానికి కృషి

గంట్యాడ: రానున్న ఎన్నికలలో గజపతినగరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండపల్లి శ్రీనివాసరావుని ఎమ్మెల్యేగా గెలిపించాలని మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు కోరారు. మండలంలో నరవ ముదపాక, గింజేరు, కొండతామరపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి అయిన కొండపల్లి శ్రీనివాస్‌ని ఎమ్మెల్యేగా అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరవ మాజీ సర్పంచ్ సుంకరి రామునాయుడు, మండల జనసేన అధ్యక్షులు సారధి అప్పలరాజు, నందం మాజీ ఎంపిటిసి సంక్రాంతి పైడిరాజు, పెదమి మాజీ ఎంపిటిసి కళింపుడి జగన్నాథం, కాశీ కృష్ణ, మోకాస్తపాడు సర్పంచ్ బండారు సూర్యారావు, రాజధాని భవాని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంట్యాడ: మాట్లాడుతున్న మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరికీ రక్ష

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల అప్పన్నపాలెం పంచాయతీలో జగనన్న సురక్ష మెగా వైద్య శిబిరం సర్పంచ్ కోన దేముడు, సెక్రటరీ అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 315 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇ.గోపాలకృష్ణ తెలిపారు. జగనన్న సురక్ష శిబిరంలో బీపీ, షుగర్, హెచ్.బి, యూరిన్ టెస్ట్, మలేరియా, డెంగీ, టీబీ స్పూటమ్ టెస్ట్ చేసి అందరికి ఉచితంగా మందులు అందజేశారు. శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జ్యోతి ప్రియాంక 72 మందికి కళ్ళు తనిఖీ చేసి 12 మందికి కంటి ఆపరేషన్‌కి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఆర్థోపెడిక్స్ డాక్టర్ జి. రవి తేజ 57 మందికి తనిఖీ చేసి ఇద్దరినీ కేజీహెచ్‌కి రిఫర్ చేశారు. స్త్రీ వైద్య నిపుణులు కె. జ్యోతిర్మయి 44 మందికి తనిఖీ చేయగా నలుగుర్ని ఎస్. కోట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. జనరల్ ఒపీ 94 మందికి డాక్టర్ గోపాలకృష్ణ తనిఖీ చేసినట్లు తెలిపారు.

కొత్తవలస: రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యులు

జగనన్న సురక్ష క్యాంపులో అప్పన్న పాలెం, దత్తి, ధన్నినపేట, జిందాల్ వర్కర్స్‌కి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మలపాలెం వైసిపి నాయకులు కె. శ్రీనివాసరావు, ఆతవ రమేష్, పి. నాగేశ్వరావు, బి. అప్పలనాయుడు, పీహెచ్సి సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని పాటూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి 450 తనిఖీలు నిర్వహించారు. రోగ నిర్ధారణ బట్టి వారికి అవసరమైన మందులను ఉచితంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ రమాదేవి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, అభినవ్ నర్సింగ్ హోమ్ ఈశ్వర్‌రావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

మెరక ముడిదాం: మండలంలోని బైరిపురం సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విశేష స్పందన లభించింది. 309 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి వారికి ఉన్నతమైన వైద్య సదుపాయం కల్పించనున్నట్లు గర్భాం పిహెచ్‌సి వైద్యులు అజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పప్పల విజయకుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణమూర్తి, వైసిపి నాయకులు పప్పల గ్రహణేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి గాయత్రి, వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జియో రామకృష్ణకు అవార్డు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ స్వచ్ఛంధ సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా 'బెస్ట్ హ్యూమనిటేరియన్ ఎక్సలెన్స్ సేవ ఎన్‌జిఒ అవార్డు 2024'ను గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణకు మంగళవారం ప్రదానం చేశారు. విశాఖపట్నం దసపల్లా నివేదిక సభా ప్రాంగణంలో అతిధులు మెడికవర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. రామమూర్తి, వరుణ్ హెల్త్ సెంటర్ ఉపాధ్యక్షులు డాక్టర్ బంగార్రాజు, ప్రజాపతి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మ కుమారి బి.కె.రామేశ్వరి, కుమారి దీపికా గుణుకుల, ప్రముఖ దర్శకుడు డాక్టర్ మణి భూషణ్ కుమార్ చేతుల మీదుగా జ్ఞాపికను, ధృవపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. రామకృష్ణకు అవార్డు రావడం పట్ల పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజాం మండలం లోని కంచరాం, డోలపేట , పొగిరి గ్రామాలలోని జెడ్‌పి హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర మంగళవారం స్టేషనరీ పంపిణీ చేసారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం లో విద్యాభివృద్ధి కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చారన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

బియ్యం పంపిణీ చేస్తున్న కాంతారావు, తదితరులు

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు, కెఆర్ హెల్పింగ్ హేండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు యాదవ్ అధ్యక్షతన 16వ డివిజన్‌లో పేదలకు మంగళవారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ భవిష్యత్తులో పేదలకు చేయూతను అందించడంలో వారి ఆర్థిక స్థితిగతులను ఉన్నతంగా మలచడంలో ముందుం టానని తెలిపారు. ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ అధ్యక్షులు ముద్దాడ మధు మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మార్చడంలో ఇటువంటి కార్యక్ర మాలు ఎంతో దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం రీజయన్ కోఆర్డినేటర్లు జానకిరామ్, హెల్పింగ్ హేండ్స్ ట్రస్ట్ సభ్యులు నవీన్ దాస్, కిరణ్, అనిల్,రామ్ నాయుడు, రవి, ధనరాజ్, సూర్య పాల్గొన్నారు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: మున్సిపాలిటీలో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేసేందుకు భోజరాజపురం వద్ద ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రం వద్ద నిర్వహణ పనులు నిమిత్తం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ వాసుదేవ్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ స్వతంత్ర పోరాటంలో చాలా కీలకపాత్ర పోషించాడని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్. జి.ఈరన్న మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ 1928 సెప్టెంబర్‌లో భగత్ సింగ్ సుఖదేవ్ మొదలగు వారితో కలిసి హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ అనే సంస్థను స్థాపించారని వీరందరూ కలిసి లాలాజపతిరాయ్ మరణానికి కారకుడైన స్కాట్ అనే బ్రిటిష్ పోలీసు అధికారిని చంపాలనుకున్నారని గుర్తు చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర పోరాటంలో తన జీవితాన్ని పణంగా పెట్టి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి సుధీర్, పి భాస్కరరావు,

ఎస్‌కోట: చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

జి సురేష్, కె అప్పలరాజు, డి.హైమావతి, జి లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతి నిర్వహించారు. శాఖ నిర్వహణాధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర సమరయోధుడుగా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రుణ వసూళ్లపై దృష్టి

ప్రజాశక్తి - వంగర

మండల ంలో వివిధ గ్రామాలలో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణ బకాయిలు వసూళ్లపై వెలుగు సిబ్బంది దృష్టి సారించాలని రాజాం ప్రాంతీయ సమన్వయకర్త ఎ. చిరంజీవి అన్నారు. సిఐఎఫ్, శ్రీనిధి, హెచ్‌డిఐఎఫ్, ఎస్‌విఈపి, ఉన్నతి, ఎంఎస్‌కెపి ఫండ్ రుణ బకాయిలకు సంబంధించి విఒఎలు, సీసీలతో స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమక్ష అధ్యక్షులు కాంబోతుల భగవతి అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల రుణాలకు సంబంధించి మండలంలో రూ.48 లక్షలు బకాయిలు ఉన్నట్లు వెల్లడించారు. సంఘ సభ్యుల వివరాలు త్వరితగతిన యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ సుధాకర్, ఏపీఎం చక్రపాణి సుమతి, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిరంజీవి

పాఠశాలల్లో 'లిప్' పక్కగా అమలు జరగాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసానాభివృద్ధి (లిప్) పక్కగా అమలు జరగాలని లిప్ స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. ఉపేంద్ర రెడ్డి సూచించారు. మంగళ వారం స్థానిక డైట్ కళాశాలలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో లిప్ అమలు, బోధన నిర్వహణ, విద్యార్థుల విద్యా స్థాయి మెరుగు తీరు తదితర అంశాలపై డైట్ అధ్యాపక బృందంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యాస్థాయి మెరుగుకు ఎంఇఒలు, హెచ్ఎంలు, డైట్ అధ్యాపకులు అవగాహన కల్పించాలని సూచించారు. డైట్ నుండి వెళ్ళే పరిశీలకులు ఆయా పాఠశాలల్లో లిప్ అమలపై తెలుసుకొని వెళ్లాలని సూచించారు. 6,7, 8 తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం స్థాయి కలిగి ఉండేలా బోధనలు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక జెడ్‌పి బాలికొన్నత పాఠశాలను సందర్శించి 8వతరగతి విద్యార్థులకు మాదిరి పాఠ్యాంశ బోధన, సోపానాల వారీగా బయాలజీ టీచర్ సుజాత ఆధ్వర్యంలో మాదిరి పాఠ్య బోధన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇంఛార్జి ప్రిన్స్ పాల్ మాణిక్యం నాయుడు, అధ్యాపకులు ఎంఎస్ఆర్ శర్మ, ప్రవీణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎడి

గజపతినగరం: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎడి

గజపతినగరం: మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్, కెజిబివి, జెడ్‌పిహెచ్ఎస్, మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఏ. సుబ్బారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో అక్కడికి వచ్చిన ఆయన మూడు హైస్కూల్లోని మధ్యాహ్న భోజన అమలుతీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతర మధ్యాహ్నం భోజన పథకం రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. వీటి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంఇఒలు విమలమ్మ, సాయి చక్రధర్, ప్రధానోపాధ్యాయులు నాగమణి పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సరస్వతీ దేవి విగ్రహాన్ని విశాఖపట్నం విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం. జ్యోతికుమారి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మోడల్, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు సంధించి సమాధానం రాబట్టుకున్నారు. వర్క్ బుక్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.విమలమ్మ, సాయి చక్రధర్, ప్రధానోపాధ్యాయులు నాగమణి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు పరిశీలన

వేపాడ: మండలంలోని కరకవలస, గుడివాడ, వెల్దాం ప్రాథమిక పాఠశాలలను విద్యాశాఖ అధికారులు జి జగదీశ్వరరావు, పి. బాల భాస్కర రావులు మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, తెలుగు, ఇంగ్లీషు, ప్రైమరీస్, రాయడం, చదవడం, గణితం లో కూడికలు, తీసివేతలు, టేబుల్స్, డైరీలు, ఎండిఎం పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో సిఆర్పిలతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధి కొండల మామిడివలస గ్రామంలో సర్వేనెంబర్1లో 4 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని సర్పంచ్ వియ్యపు లావణ్య, స్థానిక వైసిపి నాయకులు చక్రపాణితో పాటు గ్రామస్తులు మంగళవారం డిటి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కొండ పోరంబోకు భూమికి సంబంధించి మాజీ సర్పంచ్ వియ్యపు సూర్యనారాయణ పేదల కోసం 24 ఇల్లు స్థలాలను కేటాయించి నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారని, గ్రామానికి చెందిన భూ స్వామి చల్ల రాజారత్నం, చల్ల మధుసూదన్ రావు పేదల ఇళ్లకు ఇచ్చిన స్థలంతో పాటుగా నాలుగు ఎకరాల వరకు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో ఇల్లు నిర్మాణాలు చేయడం విడ్డూరమని అన్నారు. ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వమని అడిగినప్పటికీ ఇవ్వకపోగా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. దీంతో 4 ఎకరాలపై స్టే విధించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి ఆక్రమించిన స్థలంపై విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరారు.



డీటీకి ఫిర్యాదు చేస్తున్న చక్రపాణి

నారాయణపట్నంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మొయిద నారాయణపట్నంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరి పాకకు దగ్ధమైంది. పెంట పై నిప్పు రాజుకుని అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో పూరిపాక, పశువుల శాల, గడ్డివాము పూర్తిగా దగ్ధం కాగా గీత కార్మికుడు వను రమేష్‌కు చెందిన రూ.30వేలు నగదు, 50వేలు విలువగల రెండు మేకలతో పాటు ఇంటిలో ఉన్న సామాగ్రి అగ్నికి ఆహుతై సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. పతివాడ సత్యం పశువుల శాల, గడ్డివాము పూర్తిగా కాలి దగ్ధమైంది. కాగా స్థానిక యువకులు మంటలు వ్యాపించకుండా అదుపుచేసి అగ్ని మాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రమాదం తీవ్రతను తగ్గించారు. బాధితుడి కుటుంబానికి యువకులు 50వేల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ కృష్ణ సమక్షంలో అందించారు. ఈ కార్యక్రమంలో అట్టాడ కనకారావు, నారాయణపట్నం యూత్ సభ్యులు, పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కాలిపోయిన మేకలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గుర్ల: మండలంలో ఎస్‌ఎస్‌ఆర్ పేట జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గరికివలస గ్రామానికి చెందిన కనిమెరక సన్యాసి అప్పలనాయుడు (48) మృతి చెందాడు. స్థానికులు పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. గరికివలస గ్రమానికి చెందిన సన్యాసి అప్పలనాయుడు కూలి పనులకు వెళుతుంటాడు. సోమవారం ట్రాక్టర్‌కు గడ్డి ఎక్కించడానికి ఎస్ఎస్అర్ పేట వెళ్లాడు. పనులు పూర్తి అయిన తరువాత టీ తాగడానికి వెళ్ళే ప్రయత్నంలో రోడ్డు దాటుతుండగా చీపురుపల్లి నుండి విజయనగరం వెళ్ళే టాటా మోటార్ వెహికల్ ప్రమాదవ సాత్తు ఢీకొంది. ఈ సంఘటనలో సన్యాసి అప్పలనాయుడుకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 108 వాహనంలో చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోస్ట్‌మార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి మృత దేహాన్ని తరలించారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి. ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.